క్లుప్తంగా

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం


నూతన సభ్యులతో నాయకులు

తుర్కయంజాల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ ఎన్నికల పరిశీలకుడు యంజాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకుడు కందాల బల్‌దేవ్ రెడ్డిలు అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధి ఉమర్‌ఖాన్ గూడ, సంఘీ నగర్‌లోని 208, 209, 210 బూత్ కమిటీల ఎన్నిక నిర్వహించారు. నల్ల బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, శివ గౌడ్‌లను బూత్‌ల అధ్యక్షులుగా నియమించారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. నాయకులు దానయ్య, శంకరయ్య, శ్రీశైలం, శ్రీహరి, సుధాకర్ గౌడ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాడ్గుల: విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ.. నల్లచెరువు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామ పరిధి సర్వే నంబర్ 99లో భూమి ఆక్రమణకు గురవుతుందని, అధికారులు దర్యాప్తు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్కారు భూముల కబ్జాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో సోమవారం ఏబీవీపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్తు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ, ఏబీవీపీ నిరంతరం విద్యార్థుల పక్షాన పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్లేశ్, పవన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వైభవంగా మహా పడిపూజ


అయ్యప్పకు అభిషేకం చేస్తున్న స్వాములు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో అయ్యప్ప మహాపడి పూజ, ఇరుముడి పూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి చంద్రమోహన్‌నాయర్ సమక్షంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గురుస్వాములు సాధ మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది స్వాములు ఇరుముళ్లతో శబరియాత్రకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పాండుగౌడ్, బి.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం

ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్

కందుకూరు: తుక్కుగూడ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై ఇటీవల జరిగిన మూకుమ్మడి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్ అన్నారు. ఈ మేరకు సోమవారం నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో కొంత మంది వ్యక్తులు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను అవమానించడం, భౌతికదాడులకు పాల్పడటం భావి సమాజానికి మంచిది కాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్ రెడ్డి, సురేశ్, కృష్ణ, గ్లోరీ, శాంతకుమారి, కౌసల్య, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

హరిత సంకల్పం..

- చురుగ్గా వనమహోత్సవ పనులు
- మండలంలో 24 నర్సరీల ఏర్పాటు
- లక్ష్యం 2.40లక్షల మొక్కలు


ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు

కడ్తాల్: రాష్ట్రంలో అడవుల శాతం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామాల్లో పచ్చదనం కోసం రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండల పరిధి గ్రామాల నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టగా.. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది 2025 జూన్‌లో నిర్వహించే వనమహోత్సవానికి అధికారులు ఇప్పటి నుంచే కార్యాచరణ మొదలు పెట్టారు. లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. నిత్యం నర్సరీల పనులను పర్యవేక్షిస్తున్నారు. సిబ్బందికి, కూలీలకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. మండల పరిధి 24 గ్రామాల్లో 24 నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో 10వేల చొప్పున 2.40 లక్షల మొక్కలు పెంచనున్నారు. నర్సరీలను జీపీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. వారితో పాటు, ఎంపీఓ, ఎంపీడీఓలు పర్యవేక్షిస్తున్నారు.

పాలిథిన్ సంచులు సిద్ధం

నర్సరీలలో మొక్కల పెంపకం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అందుకు అనువైన నేలను ఎంపిక చేసుకోవడంతో పాటు, ఆయా నర్సరీలలో మొక్కల లక్ష్యం మేరకు పాలిథిన్ సంచుల్లో మట్టి నింపే కార్యక్రమం పూర్తిచేశారు. మరో పక్షం రోజుల్లో విత్తనాలు నాటే ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

నీడతో పాటు.. ఫలాలు ఇచ్చే మొక్కలు

నర్సరీలలో అవెన్యూ ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలతో పాటు, రైతులకు, రహదారులకు ఇరువైపులా నాటేందుకు రకరకాల పండ్లు, పూల మొక్కలు, వాణిజ్య పరంగా లాభసాటిగా ఉండే విత్తనాలను సిద్ధం చేశారు. నీడనిచ్చే మొక్కలతో పాటు.. పండ్లు, పూలు, ఉసిరి, చింత, మునగ, నిమ్మ, జామ, సీతాఫలం, దానిమ్మ, సపోట, కరివేపాకు, నేరేడు, బాదం, చైనాబాదం, వెలగ, గులాబీ, టేకు, వేప, కానుగ, రేగు, మందారం, పచ్చగన్నేరు, గోరింటాకు, పారిజాతం తదితర మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి



24 నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రతి గ్రామంలో 10 వేలకు తగ్గకుండా మొక్కలు పెంచేందుకు పాలిథిన్ సంచులు సిద్ధం చేశాం. వచ్చే వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– లలిత, ఈజీఎస్ ఏపీఓ, కడ్తాల్

పర్యవేక్షిస్తున్నాం



పది వేల చొప్పున 24 గ్రామాల్లో 2.40 లక్షల మొక్కలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మట్టి పనులు పూర్తయ్యాయి. 15 రోజుల్లో విత్తనాలు నాటడం పూర్తవుతుంది. జూన్ నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచుతాం. అనువైన స్థలాల్లో నాటేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– సుజాత, ఎంపీడీఓ, కడ్తాల్

ఈవెంట్లకు అనుమతి తప్పనిసరి

- న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి
- హద్దుమీరితే కఠిన చర్యలు
- సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్


ప్రమోద్‌కుమార్, సీఐ, ఆమనగల్లు


శివప్రసాద్, సీఐ, కడ్తాల్

ఆమనగల్లు/కడ్తాల్: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్ సూచించారు. న్యూ ఇయర్ పేరుతో హద్దు మీరితే ఉపేక్షించిది లేదని, అనుమతి లేకుండా ఈవెంట్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఇరువురు మాట్లాడారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, వేడుకలు నిర్వహించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా దుకాణాలు మూసివేయాలని వ్యాపారులకు సూచించారు. రాత్రి 12.30 గంటల లోపు వేడుకలు పూర్తి చేసుకోవాలని, బాణసంచాలు కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయరాదని స్పష్టంచేశారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దు..

మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సీఐలు సూచించారు. రహదారులను బ్లాక్ చేసి వేడుకలు నిర్వహించరాదని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యూ ఇయర్ పేరిట.. ఆఫర్లంటూ సైబర్ నేరగాళ్లు ఆర్థికనష్టం కలిగించే అవకాశం ఉందని, ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను క్లిక్ చేయవద్దన్నారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీ నంబర్లను ఇవ్వరాదని, ఎక్కడైనా ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

పౌల్ట్రీ రైతుకు గడ్డుకాలం


ఆరుట్ల కోళ్ల ఫామ్ వద్ద కోళ్ల కళేబరాలు


బస్తాల్లో కోళ్ల కళేబరాలు

- వరుసగా కోళ్లు మృత్యువాత
- నష్టాల పాలవుతున్న నిర్వాహకులు

మంచాల: పౌల్ట్రీ ఫామ్‌ను నమ్ముకున్న రైతులు నష్టాల పాలవుతున్నారు. వరుసగా కోళ్లు మృత్యువాత పడుతుండటంతో దివాలా తీస్తున్నారు. లాభాల సంగతి ఎలా ఉన్నా.. అప్పుల్లో కూరుకుపోతున్నారు. భూగర్భ జలాలు ఆశించినంత విధంగా పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం రైతులు.. పౌల్ట్రీ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలు కోడి పిల్లలను సరఫరా చేసి, వాటికి దాణతో పాటు మందులు పంపిణీ చేస్తుండటంతో ఈ రంగంపై మొగ్గుచూపుతున్నారు.

రోజుకు వందల్లో..

మండల పరిధిలో సుమారు 357 బ్రైలర్ కోళ్ల ఫామ్‌లు ఉన్నాయి. వాటిలో 32లక్షల 87వేల కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. అదే విధంగా 12 లేయర్ కోళ్ల ఫామ్‌లు ఉండగా.. వాటిల్లో 7లక్షల 72వేల కోళ్లను పెంచుతున్నారు. ఇదిలా ఉండగా.. వారం రోజుల వ్యవధిలో ఆరుట్ల, చిత్తాపూర్, మంచాల, ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్, తాళ్లపల్లిగూడ గ్రామాల్లో బ్రైలర్ కోళ్లు భారీగా మృత్యువాత పడుతున్నాయి. రోజుకు వందల సంఖ్యలో చనిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విరేచనాలు, మెడలు వంకర పోవడం వంటి లక్షణాలతో చనిపోతున్నాయని గమనించి, మందులు వేసే లోపే మృత్యువాత పడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన కోళ్లు కావడంతో ఆయా కంపెనీల వారు ఇచ్చే మందు మాత్రమే వాటికి పని చేస్తుందని, దీంతో రైతులు నేరుగా పశుసంవర్ధక శాఖను సంప్రదించడం లేదని ఆ శాఖ అధికారులు స్పష్టంచేస్తున్నారు. కోళ్ల మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని వెల్లడిస్తున్నారు.

కుప్పలుగా..

కోళ్లకు వచ్చే వ్యాధి ఆర్‌డీ అని, ఈ వ్యాధికి సరైన మందులు లేవని రైతులు పేర్కొంటున్నారు. వ్యాధితో కోళ్లు కుప్పలుగా చనిపోతుండటంతో నష్టపోతున్నామని తెలిపారు. సాధారణంగా 10వేల కోళ్లు కలిగిన ఫాం రైతుకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల లాభం వస్తుంది. అందులో బొగ్గు, విద్యుత్ చార్జీలు, వరి పొట్టు తదితర ఖర్చులు పోను రూ.60 నుంచి 70 వేలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వాటి నిర్వహణ సక్రమంగా లేకుంటే రూ.40 వేలకు లాభం పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి కారణంగా చనిపోయిన కోళ్లకు సంబంధిత ఖర్చులు కూడా కంపెనీ వారు బతికున్న కోళ్ల లాభాల్లోనే కోత విధిస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. కోడి పిల్లలను సరఫరా చేసే సంస్థలు ఇచ్చే ఆదేశాలను అనుసరిస్తేనే మరలా కోళ్లు ఇస్తారని, లేకపోతే ఇవ్వరని వెల్లడిస్తున్నారు. ఏది ఏమైనా కోళ్ల పెంపకాన్ని నమ్ముకున్న రైతులు చివరకు నష్టాలనే మూటగట్టుకుంటున్నారు.

చదువుతోనే భవిష్యత్తు

యాచారం: శ్రద్ధగా చదువుకోవడం అలవాటు చేసుకోవాలని, అలా విద్యనభ్యసించిన వారి భవిష్యత్తు బంగారు మయంగా మారుతుందని హెచ్‌ఎం నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించగా.. మండల పరిధి ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులు 36 మంది హాజరయ్యారు. ఉపాధ్యాయులు బోజయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, కిషన్, శ్రీనువాస్, పాండునాయక్, రాజు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సులు నడపండి

యాచారం: గ్రామీణ ప్రాంతాలకు సమయానుకులంగా ఆర్టీసీ బస్సులు నడపాలని నక్కర్తమేడిపల్లి వాసి, స్వచ్ఛంద కార్యకర్త పి.రవీందర్ గుప్తా అధికారులను కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ప్రజావాణిలో ఆయన ఆర్డీఓ అనంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం నుంచి తాడిపర్తి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, చింతుల్ల, నల్లవెల్లి, మొండిగౌరెల్లి తదితర గ్రామాలకు ఉదయం, సాయంత్రం, రాత్రి పూట బస్సులు తిప్పేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఆర్డీఓ వెంటనే సంస్థ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, అవసరమైన రూట్లల్లో సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు చివరి గడువు

కందుకూరు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు, ఈ నెల 31వ తేదీ వరకు సర్వే చేస్తున్న అధికారులను కలిసి ధ్రువపత్రాలను అందించాలని ఎంపీడీఓ గీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడువు ముగిసిన తర్వాత సర్వే వివరాలు నమోదు చేయమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైభవంగా పల్లకీసేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం అమావ్యాస సందర్భంగా వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు.

నయాసాల్ సందడి షురూ


రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

- బేకరీల్లో ఆకర్షణీయమైన కేకులు సిద్ధం
- మార్కెట్లో రంగులు, డైరీ, కేలండర్లు రెడీ


ఆకర్షణీయంగా కేక్

కడ్తాల్: మరో 24 గంటల్లో నూతన ఆంగ్ల సంవత్సరం 2025లోకి అడుగుపెట్టబోతున్నాం. ఈ సందర్భంగా రొటీన్‌కు భిన్నంగా వేడుకలు జరుపుకోవడానికి యువత ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు. వీరి అభిరుచికి తగినట్లుగా బేకరీ నిర్వాహకులు వివిధ ఆకృతుల్లో కేకులు సిద్ధం చేస్తున్నారు. కేలండర్లు, డైరీలు, రంగుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

నచ్చినవారికి కానుకలు..

న్యూ ఇయర్ వచ్చిందంటే ఏవరికి తోచిన విధంగా వారు ఒకరికి ఒకరు కానుకలు ఇవ్వడం ఆనవాయితిగా వస్తోంది. కొంత మంది డైరీలు, ఫొటో ఫ్రేములు, ప్రింటెండ్ మగ్గులు, చాక్లెట్లు ఇలా గుర్తుండి పోయే విధంగా బహుమతులు ఇస్తుంటారు. అదే విధంగా అతివలు ఇంటి ముంగిట్లో రకరకాల ముగ్గులు వేసి సంబురాలు చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రతి ఒక్కరూ కేక్‌లు కట్‌చేసేందుకు మక్కువ చూపుతారు. దీంతో విపణిలో వాటికి మంచి డిమాండ్ ఏర్పడింది.

హాట్‌కేకులు..

కొనుగోలు దారులను ఆకట్టుకునేందుకు బేకరీ నిర్వాహకులు సరికొత్తగా కేకుల తయారీలో బిజీగా ఉన్నారు. వివిధ చిత్రాలతో పాటు, కార్టున్లతో సిద్ధం చేస్తున్నారు. బ్లాక్ స్ట్రాబెరి వెనీలా, చాక్లెట్ కేక్, పైనాపిల్, ఫ్రూట్స్ కేక్, బటర్ స్కాచ్, నట్స్, బటర్ క్రీమ్స్ తదితర కేక్‌లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కేకు రూ.150 నుంచి రూ.1000, ఆపై ధరలు పలుకుతున్నాయి. ఈ సందర్భంగా బేకరీ నిర్వాహకుడు సందీప్ మాట్లాడుతూ.. న్యూ ఇయర్ వేడుకలకు సాధారణ కేకులతో పాటు వెరైటీ కేకులు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

పట్టు పురుగుల పెంపకం.. లాభదాయకం


ఏడీ నాగరత్నంను సన్మానిస్తున్న రైతులు

ఆమనగల్లు: పట్టు పురుగుల పెంపకం రైతులకు లాభదాయకమని పట్టు పరిశ్రమ శాఖ ఏడీ నాగరత్నం అన్నారు. వాణిజ్య పంటల సాగుకంటే మేలైందని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం కోరింతకుంటతండాలో రైతుల పట్టు పరిశ్రమ షెడ్లను సోమవారం ఏడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీని మహిళా రైతులు సత్కరించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ.. పట్టుకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఉందని, దీని పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. 'పట్టు'కు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో శాఖ అధికారులు సౌజన్య, సౌమ్య, పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రునాయక్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ప్రవచనాల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని, నిత్యం భగవంతుని సేవలో కొంత సమయాన్ని గడపాలని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్ జోషి సూచించారు. మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. హోమం అనంతరం పూర్ణాహుతి చేశారు. భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు.

కదల్లేని స్థితిలో ఉన్నాడు..

కనికరించి ఆదుకోండి: గ్రామస్తులు


మల్లేశ్‌ను పరామర్శిస్తున్న ఎంపీడీఓ సుజాత తదితరులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన రేపని మల్లేశ్ కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో కదలలేని స్థితికి చేరుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం ఖర్చులు భరించలేక మంచానికే పరిమితమయ్యాడు. ఇప్పటికే వైద్యం కోసం స్తోమతకు మించి ఖర్చు చేసినా.. ఆరోగ్యం కుదుట పడలేదు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జీపీ కార్యదర్శి అల్లాజీలు బాధితుడి పరిస్థితిని ఎంపీడీఓ సుజాత దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం ఆమె మల్లేశ్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కదల్లేని స్థితిలో ఉన్న మల్లేశ్‌కు ప్రభుత్వ పరంగా పింఛన్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదరన్ సర్టిఫికెట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించి, తగిన రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఖరీదైన వైద్యం చేయించునేందుకు దాతలు కనికరించి ఆదుకోవాలని బాధితుడు, కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అయినవారే అంతమొందించారు

ప్రేమవ్యవహారమే హత్యలకు కారణం

- కలకలం రేపిన కానిస్టేబుల్ హత్య
- తమ్ముడి పన్నాగంతో సోదరి, కన్నతల్లి చేతిలో కూతురు..
- గడిచిన ఏడాది కాలంలో పట్నంలో నేరాలు, ఘోరాలు


హత్యకు గురైన మహిళా కానిస్టేబుల్ నాగమణి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: అయినవారే హంతకులుగా మారుతున్నారు. క్షణికావేశంలో కత్తులు దూస్తున్నారు. కొన్నింటికి ప్రేమ వ్యవహారం, మరికొన్నింటికి ఆస్తుల పంపకాలు వెరసి.. తోబుట్టువు, కన్నవారు అని చూడకుండా ప్రాణాలను బలిగొన్నారు. గతేడాది 2023లో చోటుచేసుకున్న ప్రమాదాలు, జరిగిన నేరాలు, ఘోరాలు అదే సంఖ్యలో ఈ ఏడాది 2024లో చోటుచేసుకున్నప్పటికీ.. ఓ మహిళా కానిస్టేబుల్‌ను సొంత తమ్ముడు హత్య చేయడం కలకలం రేపింది. మరో ఘటనలో తల్లి చేతిలో కూతురు హతమవ్వడం పట్నం ఠాణా పరిధిలో చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు హత్యల్లో ప్రేమ వ్యవహారమే కీలక భూమిక పోషించింది.

దారికాచి దారుణానికి..

రాయపోల్ గ్రామానికి చెందిన మహిళా కానిస్టేబుల్ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. ఆ గ్రామ శివార్లలో ఆమె సోదరుడు కారుతో ఢీకొట్టి, కత్తితో పొడిచి హతమార్చాడు. కులాంతర వివాహం చేసుకుందన్న ఆగ్రహంతో దారికాచి దారుణానికి ఒడిగట్టాడు. పెళ్లి చేసుకుని, స్టేషన్‌కు వచ్చిన అనంతరం పోలీసులు సరైన రక్షణ కల్పించలేదన్న భావన ఈ ఘటనతో వెలుగు చూసింది. ఈ కేసులో చివరకు స్టేషన్ హౌస్ అధికారి సత్యనారాయణ నిర్లక్ష్యమే కారణమంటూ అయనను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ రాచకొండ కమిషనర్ ఆదేశాలు జారి చేశారు. మరో ఘటనలో దండుమైలారం గ్రామంలో ప్రేమ వ్యవహారం వద్దని మందలించే క్రమంలో కన్నతల్లి చేతిలో కూతురు హతమయింది.

50 దొంగతనాలు

ఇబ్రహీంపట్నం కేంద్రంలోని కిరాణా దుకాణంలో జరిగిన రూ.3.50 లక్షల చోరీ అతిపెద్ద కేసుగా నమోదైయింది. ఈ కేసును పోలీసులు ఛేదించి షాపులోని వర్కరే దొంగతానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితున్ని అరెస్టు చేసి, సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. దీంతో మరో 49 దొంగతనాలు జరగగా 26 కేసులను ఛేదించారు.

79 రోడ్డు ప్రమాదాలు

గడిచిన కాలం.. పట్నం ఠాణా పరిధిలో 79 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కేవలం 16 ప్రమాదాల్లో 28 మంది మృత్యువాతపడ్డారు. రాయపోల్ సమీపంలో బైక్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృత్యువాత పడటం.. ఈ ప్రాంతంలో పెద్ద ప్రమాదంగా చోటుచేసుకుంది. మిగతా ప్రమాదాల్లో పలువురు క్షతగ్రాతులయ్యారు.

చైన్‌స్నాచింగ్‌లు

చైన్ స్నాచింగ్‌లు ఆరు చోటుచేసుకోగా, వాటిల్లో మూడు కేసుల్లోని నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అత్యాచారాలు ఆరు చోటుచేసుకున్నాయి.

మిస్సింగ్ కేసులు

63 మిస్సింగ్ కేసులు నమోదు కాగా.. సుమారు 57 కేసులను పోలీసులు ఛేదించారు. కనపడకుండా పోయిన దంపతుల కేసు మిస్టరిగానే ఉంది.

ఇతర కేసులు 250

పేకాట, అక్రమ మద్యం, కోళ్ల పందేలు, అక్రమ గ్యాస్ ఫిల్లింగ్, బ్లాస్టింగ్ తదితర కేసులు సుమారు 250కి పైగా నమోదు అయ్యాయి. ఏది ఏమైనా 2024 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు కలవరానికి గురిచేశాయి. వచ్చే కొత్త ఏడాదిలోనైనా నేరాలు, ఘోరాలు, రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడతాయని ఆశిద్దాం.